క్లుప్తంగా

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



రాయపర్తి : మండలంలోని కొత్తూరులో ముదిరాజ్ కులస్తులు మంగళవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో పెద్దమ్మతల్లి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు భీమని యాదగిరి, కార్యదర్శి భీమని రమేశ్, నాయకులు పెద్దబొట్టు సింగరబోయిన వెంకన్న, చిన్నబొట్టు భీమని శ్రీనివాస్, మాంకాళి ఎల్లయ్య, కొండ భాస్కర్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కులవివక్ష.. గుడిప్రవేశం

గ్రామానికి చెందిన భీమని నరేందర్ కుమారుడు నవీన్ దళిత సామాజికవర్గానికి చెందిన యువతిని వివాహం చేసుకున్న క్రమంలో పెద్దమ్మతల్లి గుడిలోకి రావొద్దంటూ ముదిరాజ్ కులపెద్దలు వివక్ష చూపినట్లు బాధిత కుటుంబీకులు ఎస్సైకి, ఎమ్మార్పీఎస్ నాయకులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, ఎంఆర్పీఎస్ నాయకులు గ్రామానికి చేరకుని బాధిత కుటుంబాన్ని గుడిప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్చార్జి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బిర్రు మహేందర్ మాట్లాడారు. కులవివక్ష చూపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్తో పర్యావరణం కలుషితం



నర్సంపేట : సమాజంలోని ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరగడంతో పర్యావరణం కలుషితం అవుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశ్విన్కుమార్ తెలిపారు. జయముఖి ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్లో భాగంగా చెన్నారావుపేట మండలంలోని ముగ్దుంపురంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా జ్యూట్, కాగితంతో తయారు చేసినవి వినియోగించాలని కోరారు. బ్యాగ్స్, కాగితపు బ్యాగులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగ్గళ్లపాటి లక్ష్మీనారాయణ-గీత దంపతుల ఆర్థిక సహకారంతో సోషల్ సర్వీస్ టీం ఆధ్వర్యంలో స్థానికంగా మంగళవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సోషల్ సర్వీస్ టీం సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, ముల్క సత్యనారాయణ, రామా కుమారస్వామి, ముల్క ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పర్వతగిరి : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చేవెళ్ల అయ్యాలు (54) ఈనెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అయ్యాలును కుమారుడు రాజు వరంగల్లోని ఎంజీఎంలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని సూర్యతండాలో దేశ్యానాయక్, పన్యానాయక్తండాలో కోక్యనాయక్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలతో మాట్లాడారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా

● పైపులైన్ పగిలినా అధికారుల నిర్లక్ష్యం



పగిలిన పైపులైన్, వృథా పోతున్న తాగునీరు

దుగ్గొండి : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో మండలంలోని మహ్మదాపురంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీటి వృథా అవుతోంది. ఇప్పటికి సుమారు 10 సార్లు పైపులైన్ పగిలి నీటి లీకేజీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. మళ్లీ తాజాగా బొడ్రాయి సమీపంలో పైపులైన్ పగిలిపోయి నీరు వృథా పోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మహ్మదాపురంలో 2200 జనాభా కాగా 900లకుపైగా ఇండ్లున్నాయి. 2023 నుంచి ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీరు అందుతోంది. ఇందుకోసం గ్రిడ్ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీరు చేర్చేలా ఏర్పాటు చేసిన పైపులైన్ పదే పదే లీక్ అవుతోంది. దీంతో గ్రామంలోని బొడ్రాయి సమీపంలో పైపులైన్ పగిలిపోయి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుంది. ఇప్పటికే పలుమార్లు పగిలిపోయింది. నిబంధనల ప్రకారం మిషన్ భగీరథ పైపులైన్ నేలలో 2 ఫీట్ల లోతున వేయాల్సి ఉండగా బొడ్రాయి సమీపంలో కొంత మేరకు నేలపైనే పైపులైన్ వేసిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో పైపులైన్ మీదుగా వాహనాలు ప్రయాణించే సమయంలో పైపులైన్ పగిలి నీరు లీకవుతోంది. సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇకనైనా అధికారులు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు

బొడ్రాయి సెంటర్లో అనేక సార్లు పైపులు పగలింది. కొన్నేళ్లుగా నీరు వృథా పోతోంది. సరిచేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. శాశ్వత పరిష్కారంగా పైపులైన్ను భూమి లోపలికి వేయాలి. పైపులైన్ వేసే క్రమంలో కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమస్య తలెత్తుతోంది.

\- పాలడుగుల జీవన్కుమార్, గ్రామస్తుడు

మరమ్మతులు చేపట్టాలి

వేసవి కాలం నేపథ్యంలో నీటి అవసరం కాస్త ఎక్కువ. నల్లాల ద్వారా నీరు సక్రమంగా అందితేనే సరిపోయే అవకాశం ఉంది. పైపులైన్ పగలడంతో అవసరమైన మేరకు నీరు అందడం లేదు. నీటి కోసం ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు చేయించాలి.

\- ముద్రబోయిన రాంరాజ్, గ్రామస్తుడు

సత్వరమే పరిష్కరిస్తాం

మహ్మదాపురంలోని బొడ్రాయి సెంటర్లో పైపులైన్ పగిలిన విషయం మా దృష్టికి వచ్చింది. పగిలిన చోట గ్రిడ్ మరమ్మతు బృందాలతో శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేలా పనులు చేయిస్తాం. మరో రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపడతాం.

\- శిరీష, ఏఈ, మిషన్ భగీరథ గ్రిడ్

టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవం



నర్సంపేట : కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నర్సంపేట : పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో టీజేఎస్ ఏడో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆ పార్టీ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చే లక్ష్యంతో పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, రాష్ట్ర నాయకులు బొనగాని రవీందర్, గంటి రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో పార్టీ జెండాను వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఎలిశాల రాజేశ్ ఆవిష్కరించి మాట్లాడారు. ఏడేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెద్దూరి నాగరాజు, పరకాల అజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్వాడీ' నాయకుల ముందస్తు అరెస్ట్



నల్లబెల్లి : ములుగులో మంత్రి సీతక్క క్యాంప్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన క్రమంలో మండలంలోని టీఆర్ఎస్కేవీ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. అరెస్టైన వారిలో సంఘం మండల అధ్యక్షురాలు బంద వెంకటలక్ష్మి, కార్యదర్శి సట్ల సునిత, నాయకురాలు ధనలక్ష్మి తదితరులున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ సామాజిక బాధ్యత



పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతున్న సత్యనారాయణ

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ

వర్ధన్నపేట : రాజ్యాంగ పరిరక్షణను సామాజిక బాధ్యతగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న అభివర్ణించారు. మండలంలోని నల్లబెల్లిలో మంగళవారం నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా కుట్ర చేస్తోందని ఆరోపించారు. యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాటికాయల దిలీప్, మల్యాల దేవేందర్, బిర్రు చంద్రయ్య, జక్కి గోపాల్, బిర్రు బాస్కర్, వెంకన్న, బిర్రు రమేశ్, పరశురాములు, బిర్రు అరుణ్, ఆరెల్లి నాగరాజు, నూనె హరీశ్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ఖానాపురం : మండలంలోని ఐనపల్లి సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్లో ప్రవేశాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు. ఆమె విలేకరులతో మంగళవారం మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ రెగ్యులర్ కోర్సులతోపాటు పలు వృత్తి విద్య కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులు ఈనెల 12లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శిక్షణ వినియోగించుకోవాలి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించనున్న జిమ్నాస్టిక్స్ శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలని కోచ్ శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. వేసవి సెలవుల నేపథ్యంలో హైస్కూల్లో శిక్షణా శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మే 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9441686288లో సంప్రదించాలని సూచించారు.

'ముదిరాజ్'లను బీసీ'ఏ'లో చేర్చాలి

● టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యువరాజ్



మచ్చాపూర్లో మాట్లాడుతున్న యువరాజ్

గీసుకొండ : బీసీల్లో అధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ' కేటగిరీలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సమాజ్ (టీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం చేపట్టిన ముదిరాజ్ ఆత్మగౌరవ పాదయాత్ర మండలంలోని మచ్చాపూర్, ధర్మారం గ్రామాల్లో మంగళవారం సాగింది. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడారు. బీసీ–డీ కేటగిరీలో ఉండడం వల్ల ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో భారీగా నష్టపోతున్నారని తెలిపారు. బీసీఏలో చేర్చడంతోపాటు ముదిరాజ్ కార్పొరేషన్కు ఏటా రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, 50 ఏళ్లు నిండిన కులస్తులకు పింఛన్ మంజూరు చేయాలని, జనాభా దామాషా మేరకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రడం భరత్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్క రాములు, సాంబయ్య, కోటి, ప్రభాకర్, లవకుమార్, సాంబమూర్తి, అశోక్, సాంబయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి'పై నేడు సదస్సు

నెక్కొండ : భూభారతి చట్టంపై మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (బుధవారం) సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ రాజ్కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారద, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన పెంచుకోవాలని కోరారు.

మేడే స్ఫూర్తితో ఉద్యమించాలి

● ఐఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి రాజేందర్



రేకంపల్లిలో వాల్పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాజేందర్, నాయకులు

దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోసం మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ కోరారు. లేబర్ కోడ్ల రద్దు కోసం పోరాడాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను మండలంలోని రేకంపల్లిలో కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా 4 లేబర్ కోడ్లుగా సవరించిందని విమర్శించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు జక్కుల తిరుపతి, హమాలీ యూనియన్ నాయకులు గట్టికొప్పుల ఐలయ్య, ఉపాధ్యక్షుడు బొమ్మెరబోయిన రాజేందర్, కోశాధికారి కానుగుల కోటి, నాయకులు మాదారపు సాంబయ్య, నర్సింహస్వామి, పింగిలి రవీందర్, పిడుగు రాజు, పొన్నం ప్రేమ్సాగర్, నీరటి రమేష్, గొల్లెన అశోక్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

గీసుకొండ : పహల్గాం మృతులకు మండలంలోని మచ్చాపూర్ గ్రామస్తులు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి తెలిపారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్, గ్రామ పెద్దలు వేల్పుల సురేశ్, గుండెబోయిన కుమారస్వామి, దూపటి యుగేందర్, శ్రీశైలం, లింగమూర్తి, గటిక నాగరాజు, అరసం యాకయ్య, బత్తిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

నర్సంపేట : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో సెల్ఫోన్కు దూరంగా ఉండేలా మే 29 వరకు డ్యాన్స్, అబాకస్, యోగ, భగవద్గీత, బాస్కెట్ బాల్, కరాటే, వాలీబాల్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యాసంస్థల కోశాధికారి డాక్టర్ వనజ మాట్లాడారు. గీత శ్లోక పారాయణం గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ జి.భవాని, ఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

'పాలకుల తప్పుడు విధానాలపై పోరాడాలి'



మాట్లాడుతున్న ఇస్మాయిల్

సంగెం : పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై కార్మికులు పోరాడాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ కోరారు. మండల కేంద్రంలో హమాలీ కార్మికులు, తాపీ మేస్త్రీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మికులు, కర్షకులు ఏకమై హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో మేడే జెండా ఎగరేసి ఐక్యత చాటాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజు, నరేశ్, వంశీకృష్ణ, గుండేటి బాబు, ప్రవీణ్, అశోక్, శ్రీనివాస్, ఏలియా, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సోషల్ ఆడిట్



మాట్లాడుతున్న డీఆర్డీఓ కౌసల్యాదేవి

గీసుకొండ : ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులు, చేసిన చెల్లింపులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో 21 గ్రామాల్లో ఎంసీసీ ద్వారా 321 పనులు నిర్వహించగా వేతనాల రూపంలో జాబ్ కార్డు కలిగిన కూలీలకు రూ.2,03,79,120 చెల్లించామని, మెటీరియల్ పనులకు రూ.14,18,264 వెచ్చించామని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి వేతనాలకు రూ.31 వేల 376, మెటీరియల్కు రూ.2,91,91,240 ఖర్చు చేసినట్లు తెలిపారు. అటవీ శాఖ నుంచి మెటీరియల్కు రూ.2,67,603 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారి, డీఆర్డీఓ కౌసల్యాదేవి మాట్లాడారు. పనుల్లో అలసత్వం వహించిన ఈసీలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలపై జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రమేశ్బాబు, క్వాలిటీ కంట్రోలర్ పుష్పలత, అసిస్టెంట్ మేనేజర్ హరీశ్, ఏపీఓ చంద్రకాంత్, ఎస్టీఎంలు అజయ్, కవిత, ఏఎం విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ మాధవి, రిటైర్డ్ పీఆర్ ఏఈ సుధాకర్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం



నల్లబెల్లి : నారక్కపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్

● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్



ఖానాపురం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్చైర్మన్ హరిబాబు



నర్సంపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గోపాల్నాయక్



దుగ్గొండి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్రెడ్డి

నల్లబెల్లి : రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నారక్కపేట, గుండ్లపహాడ్, కన్నారావుపేట, బొల్లోనిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు సన్నాలకు బోనస్ అందిస్తోందని తెలిపారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ్యోతి, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఏఓ రజిత, ఏపీఎం సునీత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్చెడ, కోనాపురం, ఉప్పరపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్నాయక్ ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఏఈఓ శశికాంత్, సొసైటీ సీఈఓ చిట్టి రవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో మహ్మదాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ మహిపాల్రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాంపల్లి సుధాకర్, జంగిలి రవి, జర్పుల శ్రీనివాస్, సీఈఓ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని రంగాపురంలో హనుమాన్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ వైస్చైర్మన్ శాఖమూరి హరిబాబు, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ధాన్యం విక్రయించొద్దని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బాబురావు, బంధారపు శ్రీనివాస్, కొమ్మాలు, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఝాన్సీరెడ్డిపై కుట్రలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిపై తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి కుట్రలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. ప్రజలకు సేవలు అందిస్తారని తిరుపతిరెడ్డిని ఝాన్సీరెడ్డి నమ్మి చైర్మన్గా అవకాశం కల్పించారని చెప్పారు. చెర్లపాలెంలో తిరుపతిరెడ్డి చెల్లని రూపాయితో సమానమన్నారు. మాజీ మంత్రి దయాకర్ రావుతో కలిసి ఎమ్మెల్యేకు పీఏగా పని చేసిన మహేశ్, ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడు ఉపేందర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు మచ్చ నీలయ్య, వల్లపు కుమారస్వామి, అఫ్రోజ్, మహమూద్, పట్టణ అధ్యక్షుడు మచ్చ రమేశ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్రెడ్డి



సీసీ పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్రెడ్డి

దుగ్గొండి : నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని ఆలయాల్లో తాగునీటి, ఇతర వసతులు కల్పించడానికి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్రెడ్డి తెలిపారు. మండలంలోని గిర్నిబావిలోని బీరన్న ఆలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆలయ ఆవరణలో సీసీ ప్లాట్ఫామ్ నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి సీడీఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్లి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ బండారి రాజ్కుమార్, నాయకులు అన్న లింగయ్య, అమ్మ కుమారస్వామి, కొక్కరకొండ అంజి, కోరె రాజేశ్, బండారి రమేశ్, ద్యాగం శివాజీ, తదితరులు పాల్గొన్నారు.